ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జయశంకర్ భూపాలపల్లి

శుక్రవారం 4 ఏప్రిల్ 2025

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి అధ్యక్షతన జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో లింగారెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వాలు విద్యారంగాన్ని సమూలంగా భ్రష్టుపట్టించాయని విమర్శించారు. ప్రస్తుత పాలకులు ప్రత్యేక దృష్టి సారించి అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.



ఇంటికే నేరుగా..

భద్రాద్రి తలంబ్రాలు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సీతారాములు కొలువు దీరిన క్షేత్ర భద్రాచలం. శ్రీరామ నవమిని పురస్కరించుకొని ప్రతి ఏటా ఇక్కడ రాములోరి కల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ పవిత్ర మహాఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో ఇక్కడికి వెళ్తుంటారు. సీతారాముల కల్యాణాన్ని తిలకించి తలంబ్రాలు తెచ్చుకుంటారు. అయితే.. దైనందిన చర్యల్లో బిజీగా ఉండే వారికి ఈ వేడుకకు హాజరయ్యే అవకాశం ఉండదు. అలాంటి వారికి ఆర్టీసీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. భద్రాచలం వెళ్లి రాములోరి తలంబ్రాలు తెచ్చుకోని వారికి నేరుగా వాటిని నేరుగా ఇంటికి పంపించనుంది. బుకింగ్ చేసుకున్న వారంలోగా తలంబ్రాలు ఇంటికి పంపించేలా ప్రతి ఆర్టీసీ డిపో నుంచి వెసులుబాటును కల్పించింది.

రూ. 151తో బుకింగ్..

సీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాలు కావాల్సిన భక్తులు ఎవరైనా బుకింగ్ చేసుకుంటే నేరుగా వారి ఇంటికే వస్తాయి. ఇందుకు భూపాలపల్లి ఆర్టీసీ డిపోలో నేరుగా లేదా ఫోన్‌లో సంప్రదించే వెసలుబాటు ఉంది. దీంతో పాటు 8143574210, 7207075373 అనే నంబర్లకు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకొని డబ్బులు చెల్లిస్తే సరిపోతుంది. ఈనెల 6న రాముల వారి కల్యాణం పూర్తయ్యాక అక్కడి తలంబ్రాలు కార్గో ద్వారా భక్తుల ఇంటికి చేరిపోతాయి. నాలుగేళ్లుగా ఆర్టీసీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా ప్రతి ఏటా సుమారు 800 బుకింగ్‌లు జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఇప్పటి వరకు 70 బుకింగ్‌లు..

భూపాలపల్లి ఆర్టీసీ డిపో పరిధిలో గురువారం వరకు తలంబ్రాలు కావాలని 70 మంది భక్తులు బుకింగ్ చేసుకున్నారు. మొదటి బుకింగ్ డిపో మేనేజర్ ఇందు చేసుకున్నారు. ఇంకా ఈ నెల 5 వరకు బుకింగ్ చేసుకొనే అవకాశం ఉంది. తలంబ్రాలు కావాలనుకునే భక్తులు డిపోలో గానీ, ఫోన్‌లో గానీ సంప్రదించి బుకింగ్ చేసుకునే అవకాశం ఉంది. ఆర్టీసీ సంస్థ నిర్దేశించిన టార్గెట్‌కు రీచ్ అయ్యేందుకు భూపాలపల్లి డిపో అధికారులు నిమగ్నమయ్యారు.





భక్తులు సద్వినియోగం చేసుకోవాలి


- ఇందు, డిపో మేనేజర్, భూపాలపల్లి



ఆర్టీసీ అందిస్తున్న అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలి. రూ.151 చెల్లించి బుక్ చేస్తే భద్రాద్రి రాముల వారి తలంబ్రాలు కార్గో ద్వారా ఇంటికి పంపిస్తాం. ఇందు కోసం ఇంకా మూడు రోజుల సమయం మాత్రమే ఉంది. భద్రచలం వెళ్లలేని భక్తులకు ఆర్టీసీ అందిస్తున్న ఇదొక గొప్ప సువర్ణావకాశం.

రిటైర్డ్ కార్మికుల అరిగోస

- పెరగని పెన్షన్.. పట్టించుకోని ప్రభుత్వాలు
- దుర్భర జీవితాలు అనుభవిస్తున్నామని ఆవేదన
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని విజ్ఞప్తి
- ధరల పెరుగుదలకు అనుగుణంగా పింఛన్లు ఇవ్వాలని డిమాండ్



భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ కార్మికుల గోస కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదు. వేజ్‌బోర్డు ప్రకారం రెగ్యులర్ కార్మికులకు పెంచిన వేతనాలతోపాటే వీరికీ పెన్షన్లు పెంచాల్సి ఉండగా ఆ నిబంధన అమలైన దాఖలాలు లేవు. ఉద్యోగ విరమణ సమయంలో ఎంతైతే పెన్షన్ ఉందో ఇప్పటికీ అదే అమలవుతోంది. దీంతో తమ జీవితం దుర్భరంగా మారిందని రిటైర్డ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారిలో సింగరేణి కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంది. సింగరేణి వ్యాప్తంగా రిటైర్డ్ కార్మికులు 84,808 మంది ఉన్నారు. వీరిలో భూపాలపల్లి ఏరియాలో 30 ఏళ్ల కాలంలో సుమారు 4,800 మంది రిటైర్‌మెంట్ పొంది ఉన్నారు. వీరిలో రూ. 500 లోపు పెన్షన్ పొందే వారూ ఉన్నారు. ఈ రిటైర్డ్ కార్మికుల సగటు అత్యధిక పెన్షన్ రూ. 20 వేలు మాత్రమే. వీరిలో దీని లోపు తీసుకొనే వారే ఎక్కువ మంది ఉన్నారు. రూ.500లోపు పెన్షన్ తీసుకునే వారి సంఖ్య 7,651 మంది ఉన్నారు. 501 నుంచి రూ. వెయ్యి వరకు తీసుకునే రిటైర్డ్ కార్మికుల సంఖ్య 11,477 మంది. రూ.1001 నుంచి రూ.1,500 వరకు పెన్షన్ తీసుకునే వారి సంఖ్య 6,639 మంది. రూ.1,501 నుంచి రూ.200 వరకు తీసుకునే వారి సంఖ్య 7,792 మంది. రూ.2,001 నుంచి రూ.5 వేల వరకు 13,990 మంది. రూ.5,001 నుంచి రూ.10 వేల వరకు తీసుకునే వారి సంఖ్య 9,552 మంది. రూ.10,001 నుంచి రూ.20 వేల వరకు తీసుకునే వారి సంఖ్య 10,925 మంది. రూ.20 వేల పైగా పెన్షన్ తీసుకునే వారి సంఖ్య 16,782 మంది ఉన్నారని సింగరేణి అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

120 ఏళ్ల చరిత్రలో పట్టించుకున్న దాఖలాల్లేవ్..

సింగరేణి ఆవిర్భావించినప్పటి నుంచి 84,808 మంది కార్మికులు రిటైర్డ్ అయినప్పటికీ వారి సంక్షేమం గురించి ఒక్క చట్టం కూడా సవరించిన దాఖలాలు లేవనే ఆందోళన వ్యక్తమవుతోంది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా, పెంచిన వేజ్‌బోర్డు ప్రకారం కార్మికుల వేతనాలతో పాటు పెన్షన్లు ఎందుకు పెంచడం లేదనే ప్రశ్న ఉత్పన్న మవుతోంది. పార్లమెంట్ సభ్యులకు జీతాలు, పెన్షన్ పెంచేందుకు 1954 చట్టం అమల్లోకి వచ్చింది. కానీ ప్రకృతికి విరుద్ధంగా, ప్రాణాలకు తెగించి దేశానికి వెలుగులు ఇస్తున్న సింగరేణి రిటైర్డ్ కార్మికులను మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. వీరికి కనీసం కరవు భత్యం కూడా సమయానికి ఇవ్వడం లేదని తెలుస్తోంది. 1998 బొగ్గు గనుల ప్రావిడెంట్ ఫండ్ చట్టాన్ని అమలు చేయడంలో పాలకులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రతి మూడేళ్లకోసారి పెన్షన్ గురించి సమీక్షించి పెంచాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ గడిచిన 120 ఏళ్లలో ఒక్కసారి కూడా ఆ దిశగా అడుగులు పడలేదు. దీంతో పెన్షనర్లు దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

ప్రభుత్వాలు దృష్టి సారించకపోతే పోరాటాలే..

- దండంరాజు రాంచందర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్



సింగరేణిలో సుమారు 84వేల మంది రిటైర్డ్ కార్మికులు ఉన్నారు. వారంతా తీవ్ర ఆర్థిక క్షోభను అనుభవిస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి మూడేళ్లల్లో ఒకసారి సమీక్షించి పెన్షన్ పెంచాల్సి ఉంది. కానీ.. పట్టించుకునే వారు కరువయ్యారు. పలుమార్లు రాష్ట్రపతిని, ప్రధాన మంత్రి, బొగ్గు గనుల శాఖ మంత్రి, కోలిండియా ఛైర్మన్‌ను, బొగ్గు గనుల శాఖ కార్యదర్శిని, లేబర్ కమిషనర్‌ను కలిసి మా గోడును వెల్లబోసుకున్నాం. ఒక్కరు కూడా స్పందించలేదు. ఇలాగే పట్టించుకోకపోతే ఢిల్లీ దద్దరిల్లేలా పోరాటు ఉధృతం చేస్తాం.

భారీ వర్షం.. రాకపోకలకు అంతరాయం



సింగారం-కాలువపల్లి గ్రామాల మధ్య లోలెవల్ కల్వర్టుపై నుంచి పారుతున్న వరద నీరు

మహాముత్తారం, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగారం, రేగులగూడెం గ్రామాల్లో గురువారం రాత్రి ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో సింగారం గ్రామం మీదుగా మేడారం వెళ్లే దారిలో కాలువపల్లి సమీపం లోలెవల్ కల్వర్టులపై నుంచి వరద నీరు ప్రవహించింది. కొద్ది సేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రేగులగూడెం, సింగారం గ్రామాల పరిధిలోని మిర్చి పంట కల్లాలోనే తడిసిపోయింది.

రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లో చిరుజల్లులు

రేగొండ (ఆంధ్రజ్యోతి) : రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల వ్యాప్తంగా గురువారం చిరుజల్లులు కురిశాయి. మధ్యాహ్నం నుం,ఇ వాతావరణం చల్లగా ఉండటంతోపాటు సాయంత్రం వరకు గాలులు వీచాయి. అనంతరం చిరుజల్లులు కురిశాయి.

భర్తను హత్య చేసిన భార్య

- మద్యం తాగొచ్చి గొడవ పడుతున్నాడని దాడి
- ములుగు జిల్లాలో ఘటన





సమ్మయ్య మృతదేహం, సమ్మయ్య (ఫైల్)

ఏటూరునాగా రం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మ ద్యం తాగొచ్చి ని త్యం గొడవ పడు తున్నాడనే కోపం తో భర్తను భార్య కర్రతో బాది హ త్య చేసిన సంఘ టన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటూరునాగారం మండలం రొయ్యూరుకు చెందిన మండప సమ్మయ్య (65)కు ఇద్దరు భార్యలు. మండలంలోని శంకరాజుపల్లి గ్రామానికి చెందిన వెంకటమ్మ పెద్ద భార్య కాగా, ఆమె ఉండగానే భూపాలపల్లి జిల్లాలోని కాటారం గ్రామానికి చెందిన స్వప్నను రెండో పెళ్లి చేసుకున్నాడు. పెద్ద భార్య వెంకటమ్మ 2015లో అనారోగ్యం కారణంగా మృతి చెందింది. దీంతో అప్పటి నుంచి సమ్మయ్య మద్యానికి బానిసై నిత్యం ఇంటికి వచ్చి చిన్న భార్యతో తగాదాపడే వాడు. ఆమెను అనుమానిస్తూ మానసికంగా వేధించేవాడు. దీంతో చిన్న భార్య స్వప్న కూడా మద్యానికి బానిసైంది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవలు పెరిగాయి. ఈ క్రమంలోనే ఎప్పటిలాగే బుధవారం ఉదయం భార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగింది. అనం తరం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన సమ్మయ్య బుధవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చి మళ్లీ స్వప్నతో గొడవకు దిగాడు. దీంతో విసిగిపోయిన ఆమె సమ్మయ్యను హతమార్చాలని నిర్ణయిం చుకుంది. అదే సమయంలో బయటకు వెళ్లి గుడుంబా తాగి ఇంటికి వచ్చిన స్వప్న మద్యం మత్తులో నిద్రిస్తున్న సమ్మ య్యను దొడ్డు కర్రతో తలపై తీవ్రంగా కొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.

గురువారం ఉదయం స్వప్న ఇరుగుపొరుగు వారికి తన భర్త అనారోగ్యంతో మరణించాడని నమ్మబలికింది. ఇరుగుపొరుగు వారు అడిగే ప్రశ్నలకు పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో అనుమానం వచ్చి ఎస్సై తాజుద్దీన్‌కు వారు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో ఆయన సంఘటన చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య స్వప్నను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. సమ్మయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం మండల కేంద్రంలోని సామాజిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తన తండ్రిని చిన్నమ్మ స్వప్ననే మద్యానికి బానిస చేసి నిత్యం చితకబాదుతూ వేధించేదని, ఈ క్రమంలోనే హత్య చేసిందని సమ్మయ్య పెద్ద భార్య కుమారుడు లక్ష్మీనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దొడ్డి కొమురయ్య ఆదర్శప్రాయుడు

నివాళులర్పించిన కలెక్టర్ రాహుల్‌శర్మ



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య ఆదర్శప్రాయుడని కలెక్టర్ రాహుల్‌శర్మ కొనియాడారు. కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన దొడ్డి కొమురయ్య జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య తెలంగాణ రైతంగ ఉద్యమంలో విశిష్టమైన పాత్ర పోషించారన్నారు. రైతుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. దొపిడీ వ్యవస్థ, వెట్టిచాకిరీ విధానాలకు వ్యతిరేకంగా యువతను కూడగట్టుకొని దొరలు, భూస్వాములపై పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి శైలజ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



మధు మృతదేహం

వెంకటాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చిరుతపల్లి గ్రామంలో గురువారం జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని చెలే మధు(31) మద్యానికి బానిసై ఏ పని చేయకుండా జులాయిగా తిరిగేవాడు. మద్యం సేవించిన సమయంలో మతిస్థిమితం సరిగా లేనట్లు ప్రవర్తించేవాడు. ఎనిమిదేళ్ల క్రితం మద్యం మత్తులో పురుగుల మందు తాగగా చికిత్స పొందాడు. మద్యం మానేయాలని కుటుంబ సభ్యులు గురువారం మందలించడంతో మనస్తాపానికి గురైన మధు ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించి వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఏటూరునాగారం వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కొప్పుల తిరుపతిరావు తెలిపారు.

ఎల్ఆర్ఎస్ గడువు పొడిగింపు

భూపాలపల్లి టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు 25 శాతం రాయితీతో పాటు ఈ నెల 30 వరకు గడువును పొడగించినట్లు మునిసిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొని..

బైక్‌పైనే ప్రాణాలు విడిచిన వ్యక్తి



ఘటన స్థలంలో కుమారస్వామి మృతదేహం



కుమారస్వామి(ఫైల్)

ములుగు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ములుగు మండలం ఇంచర్ల ఎర్రిగట్టమ్మ వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జంగాల పల్లికి చెందిన నేదునూరి కుమారస్వామి(42) మృతిచెందాడు. కొంతకాలంగా మంగపేట మండలం సంగంపల్లిలో కుటుంబంతో నివాసం ఉంటున్న కుమారస్వామి గోవిందరావుపేట మండలం చల్వాయిలో బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి ద్విచక్రవాహనంపై వచ్చాడు. అనంతరం స్వగ్రామమైన జంగాలపల్లికి వచ్చి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈక్రమంలో ఎర్రిగట్టమ్మ వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో దానికి ఢీకొన్న కుమారస్వామి తలకు తీవ్ర గాయాలతో బైక్‌పైనే మృతిచెందాడు. అయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈమేరకు ములుగు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ప్రభుత్వ ఏరియా వైద్యశాలల పోస్టుమార్టం జరిపించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

సెర్ప్‌లో మెప్మా విలీనం



తొర్రూరు మండలంలోని ఖానాపురంలో సమావేశం నిర్వహించుకుంటున్న మహిళా సంఘాల సభ్యులు (ఫైల్)

- ఒకే గొడుగు కిందకు మహిళా సంఘాలు
- నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- మునిసిపాలిటీలోని ఉద్యోగులు డీఆర్‌డీఏ పరిధిలోకి..

తొర్రూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రాంతాల్లోని పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకుల్లో రుణాలు ఇప్పించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న మెప్మా(పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) విభాగాన్ని ఇక నుంచి డీఆర్‌డీఏ పరిధి లోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్‌లో విలీనం చేశారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందుకు అవసరమైన మార్గదర్శకాలు ఇంకా జిల్లా అధికారు లకు అందలేదు. జిల్లాలో తొర్రూరు, మహబూబాబాద్, డోర్నకల్, మరిపెడ మునిసిపాలిటీల్లో మెప్మా ఉద్యోగులు, సిబ్బం దితో పాటు, జిల్లా కార్యాలయంలో పనిచేసే మెప్మా ఉద్యోగులందరు సెర్ప్ పరిధిలోకి వెళ్లనున్నారు. మునిసిపాలి టీల్లో మహిళలను గ్రూపులుగా ఏర్పాటు చేసే మెప్మా ఉద్యోగులు, జిల్లా, పట్టణ స్థాయిలో రిసోర్స్ పర్సన్‌లు 97 మంది పనిచేస్తున్నారు. మహిళా సంఘాలకు ప్రతి నెలా రుణాలు ఇప్పించడంతో పాటు చెల్లింపులు జరి గేలా చర్యలు, గ్రామీణ ప్రాంతాల్లో ఈ పనిని సెర్ప్ కార్యాలయాల్లో పని చేసే సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఈ రెండు శాఖలను విలీనం చేస్తే సెర్ప్ కార్యాలయంలో విధులు నిర్వర్తించనున్నారు.

జీతాల్లో తేడా..



సోమారంలో సమావేశం నిర్వహిస్తున్న మహిళా సంఘం సభ్యులు (ఫైల్)

పట్టణంలోని మెప్మా రిసోర్స్ పర్సన్‌లకు రూ.6వేలు, ఆర్‌పీలకు రూ.5వేల చొప్పున వేతనం చెల్లిస్తున్నారు. ఒకవేళ ఈ రెండు గ్రూపులు కలిపితే జీతాలు పెరుగుతాయా లేదా తగ్గు తాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మహిళా సంఘాల విలీనంపై త్వరలో మార్గదర్శకాలు విడుదల కానున్నాయ ని సంబంధిత అధికారులు చెబుతున్నారు. మునిసిపల్, గ్రామీణ ప్రాంతాల్లో ఎప్పటిలాగే కార్యకలాపాలు ఉండే అవ కాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఒకే శాఖ పరిధిలో ఉద్యో గులు పనిచేసేలా అధికారులు విధి విధానాలు రూపొందిస్తున్నట్లు తెలుస్తుంది. సర్వేలు, ఓటరు జాబితా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన, తదితర విధులు యథావిధిగా నిర్వర్తించాల్సి ఉంటుంది.

పట్టణాల్లో సర్వేకు ఇబ్బంది

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు, ఇతర పనుల కోసం మునిసిపల్ అధికారులు మెప్మా ఆర్‌పీలను వినియోగించుకుంటున్నారు. వారికి పట్టణంలో, కాలనీల్లో ఉండే వారి వివరాలు తేలికగా తెలిసే అవకాశం ఉంటుంది. కానీ, వారు ఇతర శాఖలకు వెళ్తే మునిసిపాలిటీ సేవలకు దూరమవుతారు. వారు మునిసిపాలిటీల్లో పనిచేయకపోవచ్చు అనే చర్చ నడుస్తుంది. దీంతో మునిసిపల్ యంత్రాంగానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణయం

విజయ, మెప్మా మానుకోట జిల్లా అధికారి

మెప్మాను సెర్ప్‌లో విలీనం చేస్తూ ఇటీవల ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు అనుగుణంగా జీవో జారీ అయింది. కానీ, విధి విధానాలకు సంబంధించి మార్గదర్శకాలు రాలేదు. ప్రభుత్వ నిర్ణయం మేరకు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల్లో 2,660 మహిళా సంఘాలుండగా వాటిలో 27,785 మంది సభ్యులుగా ఉన్నారు. సెర్ప్ పరిధిలో జిల్లాలో 18 మండలాలు ఉండగా 16 మండల సమాఖ్యలు, 15,100 మహిళా సంఘాలు, 1లక్ష 52వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వారికోసం 680 మంది వీవోఏలు విధులు నిర్వర్తిస్తున్నారు.

నవోదయ విద్యాలయాలు మంజూరు చేయాలి

మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న పోరిక బలరాంనాయక్

మహబూబాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో ఆదివాసీ, గిరిజనుల విద్యాభ్యున్నతి కోసం మూడు నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని ఎంపీ పోరిక బలరాం నాయక్ కోరారు. న్యూఢిల్లీలో జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో గురువారం జీరో అవర్‌లో స్థానిక ఎంపీ పలు అంశాలపై మాట్లాడారు. మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో గిరిజన, ఆదివాసీలతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ప్రజలు అత్యధికంగా ఉన్నారని, వారంతా విద్యకు దూరంగా ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వారి విద్యాభ్యున్నతి కోసం తన పార్లమెంటరీ నియోజకవర్గంలో కొత్తగా మూడు నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఆదివాసీ, గిరిజన, ఏజెన్సీ ప్రజలకు విద్యను దగ్గర చేసి వారు ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఎంపీ కోరారు.

గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ పోస్టర్ల ఆవిష్కరణ



గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యాదవులు

మరిపెడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంపురంలో గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ పోస్టర్లను గురువారం ఆ ఊరి యాదవ కుల పెద్దలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొమ్ము చంద్రశేఖర్, నరేశ్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 13 వరకు వివిధ పూజా కార్యక్రమాలు వేద పండితులచే నిర్వహించి గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. కోడి శ్రీకాంత్, నల్లపు లింగయ్య, ఉప్పలయ్య, ఐలయ్య, మహేశ్ తదితరులు పోస్టర్లను ఆవిష్కరించారు.

మేలు రకం విత్తనాలను ఎంచుకోవాలి

మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి

కేసముద్రం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మేలు రకమైన విత్తనాలతో అధిక దిగుబడి వస్తుందని మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని కల్వలలో మేలు రకమైన మొక్కజొన్న విత్తనాలతో అధిక దిగుబడులు సాధించిన మేకపోతుల మోహన్‌రెడ్డిని ఆయన సన్మానించారు. నాగేంద్రబాబు, హన్మంతరావు, జ్ఞానేశ్వర్, వక్కల శ్రీనివాస్, ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, డీలర్స్ అసోసియేషన్ జిల్లాఅధ్యక్షుడు వోలం రమేష్, కొయగూరి యాకూబ్‌రెడ్డి, వోలం సందీప్, కొత్తపల్లి శేఖర్, జి.శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.



కల్వలలో మొక్కజొన్న రైతు మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న సంజీవరెడ్డి



తొర్రూరు బస్టాండ్ సెంటర్లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేవైఎం నేతలు

యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని నిరసిస్తూ ఆందోళన

- సీఎం దిష్టిబొమ్మను దహనం చేసిన బీజేవైఎం నాయకులు

తొర్రూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని నిరసిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో గురువారం తొర్రూరులోని బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కాగు నవీన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ కంటే ఎక్కువ నియంతృత్వ ధోరణిలో రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని, తెలంగాణ రాష్ట్రం సహకారం కావడంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థి లోకాన్ని సీఎం ఇబ్బందులకు గురి చేస్తున్నాడని విమర్శించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం అమానుషమని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, విద్యార్థులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేనిచో యూనివర్సిటీవద్ద బీజేవైఎం ఆధ్వర్యంలో నిరవధిక దీక్ష చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనాథ్, సంతోష్, సందీప్, రాజు, ప్రవీణ్, ఉదయ్, రేవంత్, శ్రీకాంత్, బన్నీ, కర్ణాకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

పాఠశాలల బలోపేతానికి పాటుపడాలి

జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి



ఉపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న డీఈవో రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి సూచించారు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జిల్లాలో పదోన్నతి పొందిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల రెండు రోజుల శిక్షణ శిబిరాలను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పదోన్నతి పొందిన ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాలల నిర్వహణ, పరిపాలన, అకాడమిక్, మధ్యాహ్న భోజనం నిర్వహణ మొదలగు అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలన్నా రు. పాఠ్యపుస్తకాల వినియోగం, తరగతి గదిలో విద్యార్థులకు బోధన, నేర్పించడం, ప్రాక్టీస్, ఐసీటీ పరికరాలు, అకాడమిక్ స్టాండర్డ్ అభ్యసన సామర్థ్యాలు పెంపొందేలా చూడాలని డీఈవో పేర్కొన్నారు. వార్షిక ప్రణాళిక, పాఠ్యప్రణాళిక, యూనిట్, ఎస్ఏ పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం మొదలగు అంశాలపై రిసోర్సు పర్సన్‌లు అవగాహన కల్పించారు.

ఈ శిక్షణలో క్వాలిటీ కంట్రోలర్ ఆజాద్ చంద్రశేఖర్, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, రిసోర్సు పర్సన్‌లు పాల్గొన్నారు.

భూపాలపల్లికి బైపాస్ రోడ్డు మంజూరు చేయాలి

- ఎఫ్‌వోబీ, ఆర్‌వోబీలను నిర్మించాలి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ కావ్య వినతి



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ కావ్య

హనుమకొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు మంజూరు చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. గురువారం కావ్య ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని సమర్పించారు. గనులు, అడవులతో సహజ వనరులు సమృద్ధిగా ఉన్న భూపాలపల్లి జిల్లాలో నిత్యం పెద్ద ఎత్తున పారిశ్రామిక కార్యకలాపాలు జరుగుతున్నందు వల్ల ట్రాఫిక్ పెరిగిపోయి పెద్ద ఎత్తున ప్రమాదాలు జరుగుతున్నాయని కేంద్ర మంత్రికి తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి భూపాలపల్లి పట్టణం చుట్టూ బైపాస్ రహదారిని 2024-25 వార్షిక ప్రణాళికలో చేర్చాలని, దాని నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించాలని కేంద్ర మంత్రిని అభ్యర్థించారు. ఎంపీ విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. వెంటనే డీపీఆర్ తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలి..

జాతీయ రహదారి-163 జనగామ జిల్లా, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని నిడిగొండ, రఘునాథపల్లి, ఛాగల్, చిన్నపెండ్యాల, కరుణాపురం గ్రామాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు లేకపోవడంతో గ్రామస్థులకు ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిని నివారించేందుకు ఆయా గ్రామాల పరిధిలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను మంజురు చేయాలని కూడా కోరారు. కొన్ని గ్రామాల్లో సర్వీస్ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇందుకు సంబంధించి భూసేకరణ కూడా పూర్తయిందని వెల్లడించారు. వెంటనే సర్వీస్ రోడ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా జనగామ ఆర్‌వోబీ నుంచి కరుణాపురం వరకు అన్ని గ్రామాల్లో డ్రైనేజీలు నిర్మించారని, కానీ ఆ డ్రైనేజీల్లోని నీరు బయటకు వెళ్లకుండా గ్రామాల్లోకి వస్తున్నదని, కనుక మురుగునీరు బయటకు వెళ్లేలా నిర్మాణాలు చేపట్టాలని అభ్యర్థించారు. వరంగల్ - జనగామ ఎంట్రీ పాయింట్ వద్ద నాలుగురోడ్లను కలిపే జంక్షన్ ఉందని, అక్కడ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, భద్రతా చర్యల దృష్ట్యా జంక్షన్ పాయింట్‌ను అభివృద్ధి చేయాలని డాక్టర్ కావ్య కోరారు. ఎన్‌హెచ్-163 దాటే జనగామ-సూర్యాపేట నేషనల్ హైవే ఆర్‌వోబీ వద్ద ఉన్న అప్రోచ్ రోడ్లు చాలా వరకు ఇరుకుగా ఉండడంతో వాహనాల రాకపోకలకు అనుకూలంగా లేకపోవడం వల్ల ఆయా పాయింట్ల వద్ద తరుచూ అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. అప్రోచ్ రోడ్ల విస్తరణ పనులు చేపట్టేందుకు నిధులను మంజూరు చేయాలని కోరారు.

గంజాయితో విద్యార్థి పట్టివేత

మంగపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గంజాయిని సరఫరా చేస్తున్న విద్యార్థి ములుగు జిల్లా మంగపేట పోలీసులకు గురువారం పట్టుబడ్డాడు. ఎస్సై సూరి తెలిపిన వివరాల ప్రకారం.. ఏటూరునాగారం మండలంలోని శంకరాజుపల్లి గ్రామానికి చెందిన 19 ఏళ్ల కుమ్మరి మోహన్‌రావు కొంత కాలంగా గంజాయిని సరఫరా చేస్తున్నాడు. ఏటూరునాగారంలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న అతడు మంగపేట మండలంలోని కమలాపురం నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఏటూరునాగారంలో తోటి విద్యార్థులతో పాటు ఇతర వ్యక్తులకు విక్రయిస్తున్నాడు. మంగపేట మండలం కమలాపురం, ఏటూరు నాగారం మండలం రామన్నగూడెం గ్రామాల మధ్య క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు గురువారం తనిఖీలు నిర్వహించగా సుమారు రూ.25వేల విలువ చేసే 475 గ్రాముల ఎండు గంజాయితో పట్టుబడ్డాడు.



గంజాయి తరలిస్తున్న విద్యార్థి అరెస్టును చూపుతున్న పోలీసులు

ములుగు జిల్లాలో అకాల వర్షం

- మామిడి, మిర్చి రైతులకు నష్టం



గోవిందరావుపేటలో కురుస్తున్న వర్షం

ములుగు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో గురువారం అకాల వర్షం కురిసింది. మంగపేట, కన్నాయిగూడెం, ఏటూరునాగారం, తాడ్వాయి, గోవిందరావుపేట, వాజేడు మండలాల్లో జల్లులు పడ్డాయి. మంగపేట, గోవిందరావుపేట, ఏటూరునాగారంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవగా, మిగిలిన రెండు మండలాల్లో మోస్తరు వాన పడింది. రెండురోజులుగా వాతావరణం చల్లబడుతుండగా అధికారులు వర్షసూచన చేశారు. అయితే వానకు తోడు గాలులు వీయడంతో జనం ఇబ్బంది పడ్డారు. మామిడి తోటలకు స్వల్పనష్టం జరిగింది. కాయలు రాలిపోయాయి. మిర్చికోతలు కొనసాగుతుండగా కోసిన మిర్చిని కల్లాల్లో ఆరబోసున్నారు. ముందుగానే అప్రమత్తమైన రైతులు పరదాలు కప్పుకొని పంటను రక్షించుకున్నారు. కానీ, చేనులో తడిసిన మిరపకాయలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షం కురిస్తే నష్టం తప్పదంటున్నారు. యాసంగిలో సాగుచేసిన వరి పొట్టదశలో ఉండగా, కొన్నిచోట్ల కోత దశకు వచ్చింది. ఈ వానతో కోతకు సిద్ధంగా ఉన్న పంట దెబ్బతినే అవకాశముంది. వర్షం, ఈదురుగాలుల ప్రభావంతో ఆయా మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



కన్నాయిగూడెంలో మిరపకాయలు తడవకుండా ప్లాస్టిక్ కవర్లు కప్పిన రైతులు

మహిళ రిమాండ్

డోర్నకల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం జోగ్యాతండాకు చెందిన మహిళను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు డోర్నకల్ సీఐ రాజేష్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. గత ఫిబ్రవరి 5 తారీకున వాకుడోత్ ఉషా తన కుమారుడు వరుణ్ తేజ్, కుమార్తె నిత్యశ్రీకి కూల్ డ్రింక్‌లో కలుపు నివారణ మందు కలిపి తాగించింది. దీంతో చిన్నారుల పరిస్థితి విషమంగా మారింది. వైద్య చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. నిలోఫర్‌లో వరుణ్ తేజ్ కోలుకొగా, నిత్యశ్రీ చికిత్స పొందుతూ గత ఫిబ్రవరి 23న మృతి చెందింది. ఈ ఘటనపై చిన్నారుల బాబాయి వాంకుడోత్ రాంబాబు డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో అప్పుడు ఫిర్యాదు చేశారు. రాంబాబు ఫిర్యాదు మేరకు ఉషాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

సన్నబియ్యం పంపిణీ పేదలకు వరం

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్

తొర్రూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన సన్న బియ్యం పంపిణీ పేదలకు వరమని కాంగ్రెస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ అన్నారు. గురువారం పట్టణంలోని రేషన్ షాపు వద్ద ప్రభుత్వ ప్రవేశపెట్టిన సన్నబియ్యం పంపిణీ డిప్యూటీ తహసీల్దార్ నర్సయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి సన్నబియ్యం అందించాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ఈపథకాన్ని ప్రవేశపెట్టారని, ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంచంద్రయ్య, సురేందర్ రెడ్డి, దొంగరి రేవతి శంకర్, కిషన్‌యాదవ్, చిదిరాల రవి, వెంకన్నయాదవ్, ముద్దసాని సురేష్, మహేష్, సోమన్న, సోమిరెడ్డి తదితరులు ఉన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2110	1521
పల్లికాయ (సూక)	6800	5200
పల్లికాయ (పచ్చిది)	4700	4575
కందులు	6716	3022
పెసళ్లు	7506	3022
పత్తి	7300	5300
పసుపు (కాడి)	11259	10534
పసుపు (గోల)	11559	9700
తేజ మిర్చి	13150	9500
డిడి	-	-
వండర్‌హాట్	14000	10000
ఎల్లో మిర్చి	-	-
యూఎస్341	11500	9000
దేశీ	28500	18000
సింగిల్‌పట్టి	-	-
దీపిక	13000	10000
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం

వ్యక్తిత్వ వికాస వేదిక.. సాక్

విద్యార్థుల సృజనకు సాన

- కళా రంగాల్లో రాణింపునకు శిక్షణ
- సంగీత, సాహిత్య నృత్య క్రీడల్లో ప్రోత్సాహం
- వరంగల్ నిట్‌లో స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్




వరంగల్ నిట్‌లోని సాక్ సెంటర్

హనుమకొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైందిగా వరంగల్ నిట్‌కు పేరుంది. అందుకు తగ్గట్టుగానే ఇందులో చదువుతున్న విద్యార్థులు కూడా బహుముఖ ప్రజ్ఞావంతులుగా పేరుతెచ్చుకుంటున్నారు. చదువుతో పాటు సంగీత, సాహిత్య, సాంస్కృతిక, క్రీడా తదితర రంగాల్లో రాణిస్తున్నారు. వరంగల్ నిట్ వేదికగా జరిగే పోటీల్లోనే కాకుండా దేశంలోని ఇతర నిట్‌లలో నిర్వహించే అంతర్ నిట్ పోటీల్లోనూ సత్తా చాటుతున్నారు. పేరున్న కంపెనీల్లో మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు పొందుతున్నట్లే.. వివిధ పోటీల్లో విజేతలుగా నిలుస్తున్నారు. ఇందుకు కారణం వరంగల్ నిట్ క్యాంపస్‌లోని స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (సాక్). విద్యార్థులను చదువుతో పాటు వారికి ఇష్టమైన ఇతర కళారంగాల్లో రాణించేందుకు ఈ సాక్ వేదికగా నిలుస్తోంది. వారి వ్యక్తిత్వం బహుముఖంగా వికసించడంతో పాటు సృజనాత్మకతను వెలికి తీసి, దానికి సానబట్టి, నిష్ణాతులుగా తీర్చిదిద్దడంతో సాక్ చేయూతనిస్తోంది. వరంగల్ నిట్‌లో ప్రతీ సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే టెక్నోజియాన్, స్ప్రింగ్ స్ప్రీ, స్పిక్‌మేకే, యూత్‌ఫెస్ట్, ఫిల్మ్‌ఫెస్టివల్, ఇంటర్ టోర్నీల్లో విద్యార్థులు సత్తాచాటుతుండడం వెనుక స్టూడెంట్ వెల్ఫేర్ సెంటర్, ఇందులో అంతర్భాగమైన టెక్నికల్, అథ్లెటిక్, కల్చరల్, ఫిల్మ్ అండ్ మ్యూజిక్ సొసైటీలే కారణం.

టెక్నికల్ సొసైటీ..

ఈ సొసైటీ శాస్త్ర సాంకేతిక రంగాల్లో చోటు చేసుకుంటున్న సరికొత్త పరిణామాలు, ఆవిష్కరణలను విద్యార్థులకు ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు సెమినార్లు, సింపోజియాలు, వర్క్‌షాపులను నిర్వహిస్తోంది. తద్వారా విద్యార్థుల్లో సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోంది. సరికొత్త సాంకేతిక పరికరాలు, భౌతిక నమూనా రూపకల్పన, అభివృద్ధిలో విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందిస్తోంది. అంతేకాకుండా సృజనాత్మక సాఫ్ట్‌వేర్, గ్రాఫిక్ ఆధారిత నమూనాలు, గేమింగులు, ఇతర సవాళ్లు, అనువర్తనాలతో సహా కంప్యూటర్ ఆధారిత కార్యకలాపాలను ప్రోత్సహిస్తూ.. వీటిల్లో పోటీలను నిర్వహిస్తోంది. ప్రధానంగా నిట్‌లోని వివిధ విభాగాల సహకారంతో ఇన్‌స్టిట్యూట్ స్థాయిలో ఏటా సాంకేతిక పండుగ టెక్నోజియాన్‌ను భారీ ఎత్తున నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో లబ్ధప్రతిష్టులైనవారితో వైజ్ఞానిక ప్రసంగాలను ఏర్పాటు చేస్తున్నది. జాతీయ స్థాయిలో జరిగే పోటీలు, సెమినార్లలో వరంగల్ నిట్ విద్యార్థులు భాగస్వాములు అయ్యేలా ప్రోత్సహిస్తోంది.

అథ్లెటిక్స్ సొసైటీ

ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులందరిని వారికి నచ్చిన ఆటలు, క్రీడాకార్యకలాపాల్లో పాల్గొనేట్లు అథ్లెటిక్ సొసైటీ ప్రోత్సహిస్తోంది. నిత్యం విద్యార్థులకు ఆటల్లో శిక్షణనిస్తోంది. ఏటా క్రీడా దినోత్సవాన్ని నిర్వహించి విజేతలకు బహుమతులను అందిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడలు, అథ్లెటిక్స్ పోటీల్లో వరంగల్ నిట్ విద్యార్థులు భాగస్వాములయ్యేలా చూస్తోంది. క్రీడల, సంబంధిత అంశాలపై సెమినార్లు, వర్క్‌షాపులు, శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోంది.

ఫిల్మ్ అండ్ మ్యూజిక్...

ఏటా సంగీతం, ఫొటోగ్రఫీ, డ్యాన్స్ ఫెస్టివల్స్‌ను నిర్వహించడం ద్వారా ఈ కళల్లో విద్యార్థుల ప్రతిభకు ఈ సొసైటీ సానబడుతోంది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళా బృందాలతో ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ద్వారా బహుళ సంస్కృతుల సమ్మేళనంలో నిట్ విద్యార్థులను భాగస్వాములను చేస్తోంది. ముఖ్యంగా ఇన్‌స్టిట్యూట్ స్థాయిలో స్పిక్‌మేకే కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా వారిలో సంగీత జిజ్ఞాసను పెంపొందిస్తోంది. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరుగడించిన సంగీత విద్వాంసులను ఆహ్వానించి వారితో ప్రదర్శనలు ఏర్పాటు చేయిస్తోంది. విద్యార్థులకు సంగీతం, ఫొటోగ్రఫీ, నృత్యాల్లో శిక్షణా తరగతులను నిర్వహిస్తోంది. సంగీత, నృత్య ఫొటోగ్రఫీ తదితర రంగాల్లో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ఏటా యూత్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తోంది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పేరుగాంచిన సినిమాలను తెప్పించి విద్యార్థులు, సిబ్బందికి కాలేజీ ఆడిటోరియంలో ప్రదర్శింప చేస్తోంది. ఇందులో భాగంగా ప్రతీ ఏటా చలనచిత్రోత్సావాన్ని నిర్వహిస్తోంది.

సాక్ ఏర్పాటు లక్ష్యం...

స్టూడెంట్ వెల్ఫేర్ సెంటర్ ఏర్పాటు వెనుక ఒక మహత్తర లక్ష్యం, దూరదృష్టి ఉన్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, భాషలకు చెందిన విద్యార్థుల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ సెంటర్ ఏర్పాటైంది. నిట్‌లో నిత్యం చదువులో మునిగితేలే విద్యార్థులకు ఆటవిడుపుగా వారు పాఠ్యేతర కార్యకలాపాల్లోనూ పాల్గొనేలా ప్రోత్సహిస్తారు. అలాగే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పొంపొందించడం, వ్యవస్థాపకత, వినూత్న నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో ఎంతో సహాయపడుతోంది. కాలేజీలో ఏటా సాంకేతిక, సాంస్కృతిక, అథ్లెటిక్స్, చలన చిత్ర, సంగీత కార్యక్రమాల్లో ఇంటర్ నిట్ పోటీలను, ఇతర అంతర్, సంస్థాగత కార్యకలాపాలను నిర్వహిస్తోంది. సాక్ ఆధ్వర్యంలో నాలుగు సొసైటీలు విజయవంతంగా పని చేస్తున్నాయి. వేటికవే తమ నిర్దేశిత లక్ష్యాలు, ఉద్దేశాలతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఈ సొసైటీలకు ప్రతినిధులు విద్యార్థులే. సారథ్యంలోనే ఏ కార్యక్రమమైనా నడుస్తుంది. ఈ క్రమంలో నిట్ అధికారులు వారికి మార్గదర్శనం చేస్తారు.



స్ప్రింగ్ స్ప్రీ సందర్భంగా సినీ నేపథ్య గాయని గీతామాధురి మ్యూజికల్ నైట్ (ఫైల్)

కల్చరల్ సొసైటీ

సృజనాత్మక రచన, కవి త్వం, నాటకం, కళ, క్రాఫ్ట్, శిల్పం, పెయింటింగ్, ఫొటోగ్రఫీ, క్విజ్ తదితర విభాగాల్లో పాఠ్యేతర కార్యకలాపాల్లో భాగంగా విద్యార్థులు పాల్గొనేలా కల్చరల్ సొసైటీ కృషి చేస్తోంది. సృజనాత్మక రచనపై వర్క్‌షాపులు, జాతీయ లేదా ఇన్‌స్టిట్యూట్ స్థాయిలో పోటీలు నిర్వహిస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, కళాశాల దినోత్సవం లాంటి వేడుకలు కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక పోటీలను కూడా సొసైటీ నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రతీ ఏటా అంగరంగ వైభవంగా స్ప్రింగ్ స్ప్రీ (వసంతోత్సవం) వేడుకలు ఈ సొసైటీ నేతృత్వంలోనే జరుగుతున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే సాంస్కృతిక బృందాలతో ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ద్వారా బహుళ సాంస్కృతిక వాతావరణాన్ని సృష్టించడంలో కల్చరల్ సొసైటీ కీలక భూమిక పోషిస్తోంది.



ఇటీవల నిట్‌లో జరిగిన స్ప్రింగ్ స్ప్రీ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వీధి నాటకం (నుక్కడ్)

నీలి నీలి.. ఆకాశం..




అప్పటివరకు సూర్యుడు సుర్రుమన్నాడు. ఎండతీవ్రతకు జనం అల్లాడిపోయారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు పడగా.. హనుమకొండలో వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతమైంది. నీలిరంగు మేఘాలతో.. చల్లని గాలులతో ప్రజలకు ఆహ్లాదాన్ని, ఉపశమనాన్ని పంచింది. ఆ సమయంలో హనుమకొండ కలెక్టరేట్ వద్ద ఓ వైపు పచ్చని చెట్లు.. వాటి మధ్య ఠీవిగా నిలిచిన కాకతీయ తోరణం.. పైన నీలి మేఘాలు ఆవరించిన ఆకాశం చూపరులను ఎంతగానో అలరించాయి.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

కాళేశ్వరంలో గోదావరి ఒడ్డున జ్ఞానతీర్థం

- ప్రయాగరాజ్ తరహాలో ఏర్పాటుకు సన్నాహాలు
- అబ్బురపరిచేలా సుమారు రూ.20లక్షలతో నిర్మాణం
- సరస్వతి పుష్కరాలకు ముందే పూర్తయ్యేలా కసరత్తు



కాళేశ్వరంలో గోదావరి ఒడ్డున ఏర్పాటు చేయబోయే జ్ఞాన తీర్థం విగ్రహ నమూనా



ప్రయాగ్‌రాజ్‌లో ఏర్పాటు చేసిన విగ్రహాలు..

మహదేవపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రయాగరాజ్ తరహాలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం గోదావరి ఒడ్డున జ్ఞానతీర్థం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. సరస్వతి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టగా.. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ఏర్పాట్లలో భాగంగా మహా కుంభమేళాలో ఏర్పాటు చేసిన విధంగా కాళేశ్వరం గోదావరి పుష్కర ఘాట్ వద్ద భక్తులను ఆకట్టుకునేలా.. అబ్బురపరిచేలా జ్ఞాన తీర్థం విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్రయాగరాజ్‌లో రెండు చేతులతో నమస్కరించే నమూనా విగ్రహాలను ఏర్పాటు చేయగా పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలోని సరస్వతీ పుష్కరాలలో ప్రయాగరాజ్ విగ్రహాలకన్నా అద్భుతంగా జ్ఞానాన్ని పంచేలా జ్ఞాన సరస్వతి చేతులలో తాళపత్రాలు చేతులలో ఉంచి జ్ఞాన తీర్థం ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు గాను రూ.20 లక్షలు వెచ్చించనున్నారు. విగ్రహ ఏర్పాటుకు దేవాదాయ శాఖ స్థపతి, ఆర్కిటెక్చర్ అధికారులు మూడు రోజుల పాటు పుష్కర ఘాట్ వద్ద కొలతలు తీసుకొని అందుకు తగిన నమూనా చిత్రాన్ని తయారు చేశారు. పుష్కరాల కన్నా ముందే ఈ విగ్రహాలను పూర్తిచేసేలా కసరత్తు చేస్తున్నారు.

కష్టాలు గట్టెక్కే.. నీటిడ్రమ్ముతో నడిచొచ్చే..

నేటికీ పల్లెల్లో నీటి కష్టాలు కనిపిస్తూనే ఉన్నాయి. చాలామంది గ్రామీణులు ముఖ్యంగా అడవిబిడ్డలు నీటికోసం మైళ్ల దూరం నడిచేవారు. బిందెలను నెత్తినపెట్టుకుని ఆపసోపాలు పడుతూ ఇల్లు చేరే వారు. ఆ పరిస్థితుల నుంచి ఉపశమనం కలిగించేలా ములుగు జిల్లాలోని పలు గిరిపల్లెల ఆడబిడ్డలకు నాబార్డ్ అనే స్వచ్ఛంద సంస్థ 2018లో నెట్టుకుంటూ వెళ్లే నీటిడ్రమ్ములను అందజేసింది. వాటిని నేటికీ వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం పరిధిలోని తక్కళ్లగూడెం గ్రామంలో ఓ మహిళ చేతిపంపు ద్వారా ఆ డ్రమ్ములో నీటిని పట్టుకుని ఇదిగో ఇలా ఇంటికి తీసుకుపోతూ కనిపించింది.

ఫొటోలు : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి




చేతిపంపు వద్ద డ్రమ్ములో నీటిని పట్టుకుని, ప్లాస్టిక్ డ్రమ్మును బండిగిర్రలా సునాయాసంగా ఇంటి తీసుకెళుతున్న మహిళ

ఈశ్వర్.. ఈల వేస్తే!

- అరుదైన కళలో రాణిస్తున్న ఓరగల్లు బిడ్డ
- మల్టీట్యాలెంటెడ్‌గా గుర్తింపు తెచ్చుకున్న యువ కళాకారుడు

వడ్డెపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఈల పాటలకు పెట్టింది పేరు ఈశ్వర్. ఈలతో అలవోకగా పాటలు పాడుతూ అందరిని ఆకట్టుకుంటున్నాడు. కాజీపేట పట్టణ ప్రాంతంలోని ఫాతిమా నగర్ ప్రాంతానికి చెందిన కీర్తి సుమతి- తిరుపతి దంపతుల కుమారుడు వెంకటరత్నేశ్వర్. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో రంగస్థల కళల విభాగంలో పీజీ పూర్తి చేశాడు. నటనపై మక్కువ, పాటలు పాడే సరదా బాల్యం నుంచే ఉండేది. ఎలాగైనా గాయకుడు కావాలనే పట్టుదలతో నాలుగు సంవత్సరాల పాటు వరంగల్ సంగీత నృత్య కళాశాలలో హిందుస్థాని గాత్రాన్ని అభ్యసించారు. అదే సమయంలో టీవీకి సంబంధించిన పలు పోటీల్లో పాల్గొంటూ తన ప్రతిభ పాఠశాలను ప్రదర్శిస్తున్నా పోటీల్లో నెగ్గక వెనకబడి పోయేవారు. తగిన విధంగా గుర్తింపు రాకపోవడంతో తనకు వచ్చిన కొత్త ఆలోచనకు రత్నేశ్వర్ శ్రీకారం చుట్టారు. ఈల పాటను సాధన చేస్తూ సమయం దొరికినప్పుడల్లా పలు వేదికల్లో ప్రదర్శనలు ఇస్తూ ప్రతిభను కనబర్చే వారు. ఈ క్రమంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో పదేళ్ల క్రితం నిర్వహించిన పాటల పోటీల్లో పాల్గొనే అవకాశం లభించింది. ఈ పోటీలలో గాయనీ గాయకులు గాత్రం ద్వారా పాటలను ఆలపిస్తే రత్నేశ్వర్ ఈల పాట ద్వారా పాటలను ఆలాపించి పలువురి చేత ఔరా అనిపించుకొని అభినందనలు అందుకొని ప్రత్యేక బహుమతిని కైవసం చేసుకున్నారు. ఇక వరంగల్‌లోని రెడ్ ఎఫ్‌ఎంలో తొలిసారి ఈలతోపాటలు పాడే అవకాశం రత్నేశ్వర్‌కు లభించింది. తన ఈల పాట ప్రస్థానం ద్వారా పలువురు శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. ఆ తర్వాత వరంగల్‌లోని ఆల్ ఇండియా రేడియోలో వచ్చే యువవాణి కార్యక్రమం, ఈ ఎఫ్‌ఎం వరంగల్, ఈ ఎఫ్ ఎం తిరుపతిలాంటి వాటితో పాటు పలు టీవీచానళ్లలో ప్రసారమయ్యే కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం వచ్చింది. అలా రత్నేశ్వర్ ఈల పాటతో పాటు వివిధ ఈవెంట్స్ చేస్తూ తన ప్రతిభను చాటుకుంటూ మల్టీ ట్యాలెంటెడ్‌గా నిలుస్తున్నాడు.



బుల్లితెరపై ప్రసారమయ్యే ఓ కామెడీ షోలో ఈశ్వర్



ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో ఈల పాట ప్రదర్శిస్తున్న ఈశ్వర్ (ఫైల్)

ఏబీఎన్, ఆంధ్రజ్యోతిలో ప్రత్యేకం..

ఏబీఎన్, ఆంధ్రజ్యోతిలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా 2021 డిసెంబరు 31వ తేదీ రాత్రి నిర్వహించిన టీవీ షోలో రత్నేశ్వర్‌కు ఈల పాట పాడే అవకాశం లభించింది. ఏబీఎన్, ఆంధ్రజ్యోతిలో వచ్చిన చౌరస్తా అనే కామెడీ షోలో నటించి ప్రేక్షకులు , శ్రోతలను మెప్పించి, మైమరిపించారు. ఈల పాట ద్వారా ఈల పాట ఈశ్వర్‌గా పేరును మార్చుకున్న అతడు పలు వేదికలపై ప్రేక్షక సమాజాన్ని మెప్పిస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు.

పర్యాటక ప్రదేశాలకు బస్సులెలా?

నగరంలో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలంటున్న ప్రజలు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చారిత్రక నగరంగా, కాకతీయులు పరిపాలించిన రాజ్యంగా, జైనులు కొలిచిన దేవతల పుణ్య ప్రదేశంగా ప్రసిద్ధికెక్కిన ఓరుగల్లు పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి గాంచింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఖ్యాతికెక్కిన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వీటిని తిలకించడానికి ప్రతీరోజు ఇతర జిల్లాలు, రాష్ట్రాలు, దేశ నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి సైతం పర్యాటకులు వస్తుంటారు. వీరు ముఖ్యంగా భద్రకాళి అమ్మవారిని, రుద్రేశ్వరస్వామిని దర్శించుకుంటారు. ఈ ఆలయాల సందర్శనకు వెళ్లాలంటే రవాణా సౌకర్యం కష్టంగానే ఉంది. ప్రత్యేక వాహనం ద్వారాగానీ ఆటోల ద్వారా గాని వెళ్లాల్సివస్తోంది. దీనివల్ల పర్యాటకులు ఇబ్బందిపడుతున్నారు. అందువల్ల ఈ ఆలయాలకు ప్రభుత్వం ప్రత్యేక బస్సులను నడిపించాలని పర్యాటకులు కోరుతున్నారు.

రైల్వే స్టేషన్ల నుంచి ఉచిత బస్సులు

కాజీపేట, వరంగల్ ప్రాంతాలకు రైలు మార్గం ద్వారా దేశం నలుమూలల నుంచి అనేక మంది పర్యాటకులు వస్తుంటారు. వీరు వరంగల్‌లో భద్రకాళి అమ్మవారిని, హనుమకొండలో వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శిస్తారు. వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి భద్రకాళి దేవాలయానికి దాదాపు 3 కిలో మీటర్ల దూరం ఉంటుంది. వేయి స్తంభాల దేవాలయం 5 కిలో మీటర్లు ఉంటుంది. కాజీపేట నుంచి వేయి స్తంభాల దేవాలయం 10కిలో మీటర్లు, భద్రకాళి దేవాలయం 12 కిలో మీటర్ల దూరం ఉంటుంది. హనుమకొండ బస్టాండ్ నుంచి వేయి స్తంభాల దేవాలయం 1 కిలో మీటరు, భద్రకాళి దేవాలయం 3 కిలో మీటర్ల దూరం ఉంటుంది. భక్తుల కోసం రైల్వేస్టేషన్లు, బస్టాండ్ల నుంచి ఈ ఆలయాలకు దేవస్థానం నుంచి గాని లేక స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గాని రెండు బస్సులు ఉచితంగా నడపాలని కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో పర్యాటక ప్రాంతాలకు..

వరంగల్ నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలో పర్యాటక ప్రాంతాలైన ఆత్మకూరు పంచలింగ శివాలయం, కాళేశ్వరం, రామప్ప దేవాలయం, లక్నవరం చెరువు, మేడారం సమ్మక్క- సారలమ్మ గద్దెలు, మల్లూరు లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంతో పాటు ఇతర పర్యాటక ప్రాంతాలు తిలకించడానికి హనుమకొండ, వరంగల్ బస్టాండ్ల నుంచి ప్రతీ రోజు బస్సులు నడపాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా ఖిలా వరంగల్, జూపార్కు, గోవిందరాజుల గుట్ట, మ్యూజికల్ గార్డెన్, భద్రకాళి దేవాలయం, వేయిస్తంభాల గుడి, కలెక్టర్ ఆఫీస్, కాకతీయ యూనివర్సిటీ, మెట్టు రామలింగేశ్వర ఆలయం, నిట్ ప్రాంగణం, భద్రకాళి బండ్ ప్రాంతాలకు కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాల భక్తులు కోరుతున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి ధనసరి అనసూయ సీతక్క

ఏటూరునాగారం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.మండలంలో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ముందుగా మండలంలోని రామన్నగూడెం, ఏటూరునాగారం మండల కేంద్రంలోని రేషన్‌షాపుల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మండల ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతి నిధులతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేదల కడుపునిండా తిండి పెట్టడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశంలోనే సన్నబియ్యం పథకం చారిత్రా త్మకమన్నారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు డీఎస్పీ రవీందర్, ఏటూరునాగారం మండల ప్రత్యేక అధికారి, డీఎండీసీ ఎస్‌వో రాంపతి, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



ఏటూరునాగారంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్ దివకర

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

ఏటూరునాగారం రూరల్ : రాష్ట్రంలోని పేదలందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందనిమంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండలంలోని చిన్నబోయినపల్లి సేల్స్ డిపోలో జరిగిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ అంటేనే నిరుపేదల పక్షాన నిలిచే పార్టీ అన్నారు. పేదలకు అన్ని విధాలుగా సహాయ సహకరాలు అందిస్తున్నామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం దిగ్విజయంగా జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జంగాలపల్లిలో సన్నబియ్య పంపిణీ

ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం జంగాలపల్లి గ్రామంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. రేషన్‌షాపు-4 వద్ద పలువురు లబ్ధిదారులకు స్వయంగా బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, డీసీఎస్‌వో డీఎం రాంపతి, ఎంపీడీవో రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం మండలంలో..

కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏటూరు, చింతగూడెం, బుట్టాయిగూడెం, సర్వాయి, తుపాకులగూడెం గ్రామాల్లో మంత్రి పర్యటించారు. గ్రామాల్లోని రేషన్ షాపుల వద్ద సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించారు. ఏటూరులో జరిగిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, డీఎండీసీఎస్‌వో రాంపతి, మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటనారాయణ, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో అనిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండి అఫ్సర్ పాషా, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాలొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించిన మంత్రి

తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను మంత్రి సీతక్క కలెక్టర్ దివాకర, పీవో చిత్రమిశ్రా, గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉన్నత చదువులకు కంప్యూటర్ నేర్చుకోవడం అవసరమన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుహాసిని, ప్రధానోపాధ్యాయురాలు రేవతి, కంప్యూటర్ ల్యాబ్ ఇన్‌చార్జి సృజన తదితరులు పాల్గొన్నారు.

మంగపేట మండలంలో పర్యటన

మంగపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపురం, మంగపేట, గంపోనిగూడెం, తదితర గ్రామాల్లో మంత్రి ధనసరి సీతక్క విస్తృతంగా పర్యటించారు. కమలాపురంలోని అంబేద్కర్ కాలనీలో సీసీరోడ్డును ప్రారంభించి రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. అనంతరం మంగపేటలోని గిరిజన కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సేల్స్‌డిపోలో సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. 25మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఇదేక్రమంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాన్ని దర్శించుకున్న మంత్రి సీతక్క శ్రీఉమాచంద్ర శేఖరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మంగపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ గురించి ప్రజలకు వివరించారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కోమటిపల్లి క్రాస్‌రోడ్డులో గల కాంగ్రెస్ భవన్‌లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్టీ అభివృద్ధి కోసం కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, నాయకులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, కొంకతి సాంబశివరావు, ఆక రాధాకృష్ణ, పాల్గొన్నారు.

మేడారంలో క్యూలైన్లపై షెడ్ల నిర్మాణం



క్యూలైన్లలో మార్కింగ్ చేస్తున్న అధికారులు

తాడ్వాయి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మేడారం దేవస్థానంలో మహా జాతరకు భక్తులు తరలివచ్చే క్యూలైన్లపై షెడ్ల నిర్మాణం పనులు గురువారం ప్రారంభమయ్యాయి. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రూ. 3.08 కోట్లతో 11 షెడ్లను నిర్మిస్తున్నారు. దేవస్థానం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం ఆధ్వర్యంలో ఈఈ అజయ్ కుమార్, డీఈ ధర్మేందర్ సిబ్బందితో కలిసి మార్కింగ్ చేశారు. మొత్తం మూడు కిలో మీటర్ల క్యూలైన్లపై 92వేల స్క్వేర్ ఫీట్స్ వైశాల్యంతో 11 షెడ్లను నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. మహా జాతరలో భక్తులకు క్యూలైన్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, సీలింగ్ ఫ్యాన్లు, టాయిలెట్స్ వంటి సౌకర్యాలను కల్పించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు క్రాంతికుమార్, వైరాగ్యం జగదీశ్వర్, ఇంజనీరింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్ తదితరులు ఉన్నారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి : పాపన్న



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాపన్న

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6న బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెన్నంపల్లి పాపన్న కోరారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రతి బూత్ స్థాయిలోనూ బీజేపీ జెండాను ఆవిష్కరించాలన్నారు. అలాగే భారతరత్న డాక్టర్ భీమ్‌రావు అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అధ్యక్షతన గురువరం జరిగిన జిల్లా పాలనాధికారుల సమావేశంలో పాపన్నన మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో మూడోసారి ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం దేశ రాజకీయాల్లో, అభివృద్ధిలో పరివర్తన కొత్త శకానికి నాంది పలుకుతోందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాల న్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, అజ్మీరా కృష్ణవేణినాయక్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ భూక్య జవహర్‌లాల్, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, రాష్ట్ర అధికార ప్రతినిధి స్వరూప, ఎస్సీమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి రామరాజు, నాయకులు జాడి వెంకటేష్, ఏనుగు రవీందర్‌రెడ్డి, జినుకల కృష్ణాకర్‌రావు, నరేష్, గంగిశెట్టి రాజ్‌కుమార్, భూక్య రాజునాయక్, శ్రీనివాస్, వినాయక్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాసం'ను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి

ములుగు కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని జిల్లాలోని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సంక్షేమ శాఖ జిల్లా అధికారి కె.శిరీష గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈపథకం ద్వారా స్వయం ఉపాధి పొందేందుకు ఈనెల 14 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు ఐదుశాతం రిజర్వేషన్ అమలులో ఉంటుందని వివరించారు.

డీడబ్ల్యూవోకు అంగన్‌వాడీల వినతి

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అంగన్‌వాడీలను ఎన్నికల సర్వేలాంటి పథకాలేతర పనుల్లో ఇన్వాల్వ్ చేయకూడదంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ఉత్తర్వులను జిల్లాలో అమలుచేసేలా చర్యలు తీసుకోవాలని, ఫిబ్రవరి పెండింగ్ వేతనం విడుదల చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు గురువారం డీడబ్ల్యూవో శిరీష, కలెక్టర్ కార్యాలయంలో వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వులను అమలుచేస్తూ జిల్లాలో అన్ని మండలస్థాయి అధికారులకు, ఐసీడీఎస్‌కు సంబంధంలేని పనులు చెప్పకుండా ఉండేవిధంగా చూడాలన్నారు. అదేవిధంగా ములుగు జిల్లా అంగన్‌వాడీలకు ఫిబ్రవరి నెల వేతనం అందించాలని, పోషణ్ ట్రాకర్ బిల్లులు, రిటైర్మెంట్ పీరియడ్‌కు ముందు డ్యూటీలో ఉన్న అంగన్‌వాడీలకు వెంటనే అందించాలన్నారు. 5జీ నెట్‌వర్క్ లేనిచోట అంగన్‌వాడీలపై ఒత్తిడి లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.సమ్మక్క, జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మారాణి, నాయకులు ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, సరిత, సూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

మంగపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణక్కపేట, తిమ్మంపేట, గంపోనిగూడెం, కమలాపురం తదితర గ్రామాల్లో సెర్ప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ డీఆర్‌డీవో బాలస్వామి గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించాలన్నారు. మధ్య దళారులకు విక్రయించి మోసపోవద్దని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన సన్నరకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2320, దొడ్డు రకానికి రూ. 2300 చెల్లిస్తున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నరకానికి రూ.500 బోనస్ అందిస్తోందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం అప్పారావు, సీసీలు జనార్ధన్, మల్లీశ్వరి, తార, సభ్యులు, రైతులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జీజీహెచ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కలెక్టర్ రాహుల్‌శర్మ గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. టీహబ్, సెంట్రల్ డ్రగ్ స్టోర్, ఎన్‌సీడీ సెంటర్, డైస్ బిల్డింగ్‌ను పరిశీలించారు. ఆస్పత్రిలో త్వరలో ఏర్పాటు చేయబోయే సిటిస్కాన్ మిషన్ గదులను సందర్శించారు. టీహబ్‌లో పరీక్షల నిర్వహణ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను తనిఖీ చేసి నిల్వ ఉన్న మందులను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల మందులు, యాంటీ బయోటిక్స్, అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వైద్యులతో సమావేశమై ఆస్పత్రి పక్కన ఉన్న డైస్ బిల్డింగ్‌ను నర్సింగ్ కాలేజీ ఏర్పాటుకు అనువుగా ఉంటుందో లేదో పరిశీలించాలని సూచించారు. ఆస్పత్రిలో కావాల్సిన అవసరాలపై నివేదిక అందించాలని సూపరిటెండెంట్ నవీన్‌కుమార్‌ను ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

గుమ్మళ్లపల్లిలో 'చిన్నకాళేశ్వరం' గ్రామసభ

కాటారం, ఏప్రిల్3 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గుమ్మళ్లపల్లి గ్రామపంచాయతీ ఆవర ణలో చిన్న కాళేశ్వరం ఎత్తిపో తల పథకం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా కెనాల్స్, డిస్ట్రి బ్యూటరీల నిర్మాణానికి సంబం ధించి 28 ఎకరాల 32 గుంటల భూసేకరణ కోసం గురువారం గ్రామసభ నిర్వహించారు. కాటారం సబ్ కలెక్టర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ప్రాజెక్టుల భూసేకరణ విభాగం) మయాంక్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో ఒడిపిలవంచ, గుమ్మళ్లపల్లి, ఆదివారంపేట రెవెన్యూ గ్రామాల పరిధిలోని రైతులు హాజరై తమ అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలిపారు. ఒడిపిలవంచ ఎర్రచెరువుకు నీటి పంపింగ్ ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. కెనాల్స్‌కు సేకరించే భూములతోపాటు గుమ్మళ్లపల్లి చెరువు నీటితో ముంపునకు గురయ్యే భూములను సైతం తీసుకోవాలని రైతులు విన్నవించారు. వీటిపై తగిన చర్యలు చేపడతామని సబ్ కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటారం తహసీల్దార్ నాగరాజు, ఎస్‌డీసీ డీఐ గంగాధర్, నాయబ్ తహసీల్దార్లు శివతేజ, షఫీ అహ్మద్, ఆర్‌ఐ వెంకటయ్య, ఇరిగేషన్ ఏఈ వెంకన్న, మండల సర్వేయర్ వినయ్, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, వంశీకృష్ణ, అపర్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాల ప్రవేశ ద్వారం ప్రారంభం

కృష్ణకాలనీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉన్నత పాఠశాల కాలరీస్ ఉన్నత పాఠశాల ప్రవేశ ద్వారాన్ని భూపాలపల్లి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ పాఠశాలను గుర్తించే విధంగా ప్రవేశ ద్వారం లేకపోవడాన్ని ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా జీఎం స్పందించి ప్రవేశ ద్వారాన్ని ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో టూ జీఎం కవీంద్ర, ఏరియా వర్క్ షాప్ డిప్యూటీజీఎం అరుణ్, రవికుమార్, పాఠశాల కరస్పాండెంట్, మారుతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న స్విమ్మింగ్ కోచ్‌కు సన్మానం

కృష్ణకాలనీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియాలో స్విమ్మింగ్ కోచ్‌గా పని చేసిన భీముని తిరుపతి బదిలీపై బెల్లంపల్లి ఏరియాకు వెళ్తుండగా ఆయన్ను గురువారం సింగరేణి అధికారులు ఘనంగా సన్మానించారు. ఏరియా అధికార ప్రతినిధి కావూరి మారుతి ఆధ్వర్యంలో సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు గుండు రాజు, పీవో శ్రావణ్‌కుమార్, క్లర్కులు రవి, చంద్రయ్య, శివ, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై బీజేపీ అనుచిత వ్యాఖ్యలు సరికావు

అయిత ప్రకాశ్‌రెడ్డి

భూపాలపల్లి టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రాజ్యంగం పట్ల బీజేపీ ఇటీవల చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికావని ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి విమర్శించారు. భూపాలపల్లి పట్టణంలోని 3వ వార్డులో రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ తలపెట్టిన పాదయాత్రను ప్రారం భించి గురువారం ఆయన ప్రారంభించారు. ఆర్ఎస్ఎస్‌ను దేశం నుంచి తరిమి కొట్టేందుకు ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్ర మంలో టౌన్ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, నాయకులు మెంగాని అశోక్, దబ్బెట రమేష్, చల్లూరి సమ్మయ్య, దాట్ల శ్రీనివాస్, సజ్జనపు స్వామి, పానుగంటి శ్రీనివాస్ హారికిక తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

మహాముత్తారం, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగారం గ్రామం నుంచి గురువారం రాజ్యాంగ పరిక్షణ కోసం జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర చేపట్టారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి సింగారంలో కార్యాక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తోందని విమర్శించారు. రాజ్యాంగ మార్పుతో దళిత, బహుజనులకు ఇబ్బందులు తప్పవని అన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పక్కల సడువలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కిష్టయ్య, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి రాజేందర్, నాయకులు దుర్గయ్య, వంశీ, సుజాత, సుగుణాకర్‌రావు, మొక్క నర్సయ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అలువాల కార్తీక్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా స్థాయి యూత్ కాంగ్రెస్ సమావేశం జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు ప్రతి కార్యకర్త వివరించి చెప్పాలని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు రజినికాంత్, చరణ్, సాయితేజ, క్రాంతి, అశోక్, రఘువర్మ, సురేష్, అఖిల్, ప్రేమ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

వెంకటాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా అందిస్తున్న సన్నబియ్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. గురువారం ఆయన కాంగ్రెస్‌పార్టీ నాయకులు, అధికారులతో కలిసి మండలంలో పర్యటించారు. చిరుతపల్లి గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న మొక్కజొన్న రైతుల కుటుంబాలను పరామర్శించారు. రైతు కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని రేషన్‌షాపులో చేపట్టిన సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. అదేవిధంగా పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన బీజేపీ మండల అధ్యక్షుడిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, నాయకులు కొండపర్తి సీతాదేవి పాల్గొన్నారు.



వెంకటాపురంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పేదల జీవితాల్లో మార్పు

వాజేడు (ఆంధ్రజ్యోతి): సన్న బియ్యంతో పేదల జీవితాల్లో మార్పులు చూస్తామని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. మండల కేంద్రంలోని జీసీసీ సెంటరు వద్ద సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. సన్నబియ్యం మార్కెట్‌లో కేజీ రూ. 60 వరకు ధర పలుకుతుండగా రాష్ట్ర ప్రభుత్వం దానిని ఉచితంగా పేదలకు ఇవ్వడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం వసతిగృహాల్లో సన్నబియ్యంతో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తోందని, ఇప్పుడు పేదలకు రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయడంతో వారికి ఎంతో మేలు చేకూరుతోందని హర్షం వ్యక్తం చేశారు. అదనపు కలెక్టర్ మహేందర్‌జీ మాట్లాడుతూ వాజేడు జీసీసీ సెంటర్ పరిధిలో అంత్యోదయ కార్డులు 45, రేషన్ కార్డులు 1,032 ఉన్నాయని తెలిపారు. ప్రతి నెల 183 క్వింటాల్ బియ్యంను సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎమెల్యే శంకుస్థాపన చేశారు. పాత శివాలయాన్ని సందర్శించారు. శివాలయం అభివృద్ధికి నిధులు ఇస్తానని స్థానికులకు హా ఇచ్చారు. సుందరయ్య కాలనీలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సాయి ప్రకాష్ కుటుంబాన్ని పరామర్శించారు. జగన్నాథపురంలో గార భూలక్ష్మి కుటుం బాన్ని పరామర్శించారు. ఆయన వెంట డీసీఎస్‌వో సయ్యద్ అహ్మద్, నూగూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పూనెం రాంబాబు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రసాదబాబు, రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ, నాయకులు కల్యాణ్ వర్మ, తల్లడి ఆదినారాయణ, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో శ్రీకాంత్ నాయుడు, ఏపీఎం లక్ష్మీదుర్గా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి



ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ములుగులోని జిల్లా సంక్షేమ భవనంలో వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి చిట్టిరెడ్డి రవీందర్‌రెడ్డి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటం ప్రారంభం కావడానికి, భూమికోసం, భుక్తికోసం, విముక్తి ఉద్యమంగా పోరాటంగా మారడానికి దొడ్డి కొమురయ్య అమరత్వమే ప్రధాన కారణమని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి మహోన్నత ఉద్యమానికి ఆద్యుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరిగె రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు యార మల్లయ్య, గ్రామ అధ్యక్షుడు కోరె రాజబాబు, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి లక్ష్మణ్‌నాయక్, బీసీ వెల్ఫేర్‌శాఖ ఉద్యోగులు సరిత, మానస, రేణుక, సదాలు, ప్రతాప్, కుమారస్వామి, నాల్గవతరగతి ఉద్యోగులు పాల్గొన్నారు.

'యువ వికాసం'ను సద్వినియోగం చేసుకోండి

రాజీవ్ యువ వికాసం పథకాన్ని జిల్లాలోని ఈబీసీలు, ఈడబ్ల్యూఎస్‌లు, మైనారిటీ వర్గాలకు చెందినవారు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి చిట్టిరెడ్డి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్థికసాయం కోసం ఆన్‌లైన్‌లో ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా ఈనెల 14 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం దరఖాస్తు కాపీని ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

బోర్లగూడెంలో వైభవంగా భోగ్ బండారో

మహాముత్తారం, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్లగూడెం బాలాజీ దేవాలయంలో శ్రీ శ్రీనివాస కల్యాణాన్ని వేదపండితులు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని ఈ మహోత్సవాన్ని తిలకించారు. అనంతరం లంబాడీల సంప్రదాయ పద్ధతులతో భోగ్ బండారో కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మహరాజ్, బాలాజీ మహరాజ్, ఆంజనేయ మహరాజ్, లఖన్‌దేవ్ మహరాజ్, హేమాసాత్ మహరాజ్, సేవాలాల్ మహరాజ్, మేరమాయాడీ, సరస్వతీ దేవతలకు చుర్మో (బెల్లం రోట్టె), బండారో (పప్పు అన్నం), ఖడావో (బెల్లం అన్నం), ఖీర్(పాయసం)తో నైవైద్యం సమర్పించారు. మంత్రి శ్రీధర్‌బాబు సోదరుడు, శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్లా నారయరణరెడ్డి కూడా పూజలు చేసి గుడి అభివృద్ధికి రూ: 50 వేల విరాళంగా ప్రకటించారు. ఒక మైక్‌సెట్‌ను కమిటీ సభ్యులకు అందజేశారు. పూజారి హట్కర్ శ్రీరామ్ మహరాజ్ అర్చకుడు వెంటా చారి, తండా పెద్దలు మంగూనాయక్, పూల్‌సింగ్ నాయక్, సీతు నాయక్ పాల్గొన్నారు.



దేవతలకు నైవైద్యం సమర్పిస్తున్న పూజారి

కేజీబీవీని తనిఖీ చేసిన స్పెషల్ ఆఫీసర్

కన్నాయిగూడెం , ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పనపల్లి వద్ద ఉన్న కేజీబీవీ పాఠశాలను మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటనా రాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల మెనూచార్టును పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతోందా? అని ఆరా తీశారు. ఆయన వెంట ఎంపీడీవో అనిత, ఎంపీవో సాజిదా బేగం, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, పాఠశాల ఎస్‌వో అశ్విని తదితరులు ఉన్నారు.

లోవోల్టేజ్ నివారణకు ప్రత్యేక చర్యలు

కాటారం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): లోవోల్టేజ్ నివారణకు, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ మల్హార్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో కొన్ని నెలలుగా ఉన్న లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించడానికి విద్యుత్‌శాఖ అధికారులు రూ.16లక్షల నిధులతో నాలుగు 100కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం ఏర్పాటు చేశారు. లోవోల్టేజ్ సమస్యను రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి ప్రజలు తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టారు.

అయ్యప్ప టెంపుల్ రోడ్, హనుమాన్‌నగర్, మాంటిస్సోరీ స్కూల్ ప్రాంతం, హమాలీవాడలో 100 కేవీఏ టాన్స్‌ఫార్మర్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ విద్యుత్ డిమాండ్ పెరిగినా సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పొలంబాట కార్యక్రమంలో వ్యవసాయ విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఈ పాపిరెడ్డి, ఏడీఈ నాగరాజు, ఏఈ ఉపేందర్, లైన్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కాంత్, విద్యుత్ సిబ్బంది తదితరులు ఉన్నారు.